ఇంటర్ విద్య.. వసతులు మిథ్య!

- అసౌకర్యాల నడుమ ఆనందపురం జూనియర్ కళాశాల
- రెండు గదులు, ఓ హాల్లోనే తరగతుల నిర్వహణ
- జూనియర్ కళాశాల స్థలం డిగ్రీ కాలేజీకి అప్పగింత
- వసతులు మెరుగుపరచాలని విద్యార్థులు, తల్లిదండ్రుల మొర

ఆనందపురం మండల విద్యార్థుల సౌకర్యార్థం 2019-2020 విద్యా సంవత్సరంలో స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఇంటర్ కళాశాల ఏర్పాటు చేశారు. అప్పట్లో 80 మంది వరకు విద్యార్థులు ప్రవేశాలు పొందినా కోవిడ్ కారణంగా రెండేళ్లు తరగతులు జరగలేదు. ఈ ఏడాది ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచింది. అయినా కేవలం రెండు తరగతి గదులు, ఓ హాల్ మాత్రమే కళాశాలకు అందుబాటులో ఉండటంతో విద్యార్థుల ప్రవేశాలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి.

తగరపువలస: మండలానికో జూనియర్ కళాశాల ఉండాలన్న లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆనందపురం జెడ్పీ హైస్కూల్ వద్ద ఇంటర్ కాలేజీని ఏర్పాటు చేశారు. 2.40 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఆరంభం నుంచే ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎంఎల్‌టీ, ఏఈటీ గ్రూపులను ప్రారంభించారు. కోవిడ్ కారణంగా దాదాపు రెండేళ్లు పెద్దగా తరగతులు జరగలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక జూనియర్ కళాశాలకు కేటాయించిన స్థలాన్ని డిగ్రీ కాలేజీకి అప్పగించి, ఇంటర్ విద్యను నిర్లక్ష్యం చేస్తోందన్న ఆరోపణలు మూటగట్టుకుంది.

పూర్తిస్థాయిలో సిబ్బంది

2025–26 విద్యా సంవత్సరానికి ఫైనలియర్ ఎంపీసీలో ఏడుగురు, సీఈసీలో ఆరుగురు విద్యార్థులు ఉన్నారు. ఈ ఏడాది ఫలితాల్లో మెరుగైన ప్రదర్శన చూపింది. ప్రస్తుతం ఫస్టియర్ ఎంపీసీలో 9, సీఈసీలో 9 మంది చేరారు. మరో ఇద్దరు చేరడానికి సిద్ధంగా ఉన్నారు. ప్రస్తుతం కళాశాలలో ఎంపీసీ, సీఈసీ గ్రూప్‌లు బోధించడానికి సరిపడా అధ్యాపకులున్నారు. ఇటీవలే టెన్త్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదలయ్యాయి ఈ నెల 30 వరకు ఇంటర్ ప్రవేశాలకు అవకాశం ఉన్నందున విద్యార్థుల కోసం అధ్యాపకులు గ్రామాల బాట పట్టారు.

స్థలం కేటాయించారు కానీ..

జెడ్పీహైస్కూల్‌ను ఆనుకుని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2.40 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. అందులో కళాశాలకు ప్రత్యేక భవనంతో పాటు, ఫర్నిచర్, ల్యాబ్, తాగునీరు, టాయిలెట్లు తదితర కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం ఈ స్థలాన్ని చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కేటాయించడంతో మళ్లీ వసతి సమస్య మొదటికి వచ్చింది. ఎంపీసీ విద్యార్థుల ప్రాక్టికల్స్ కోసం భీమిలి, మధురవాడ కళాశాలలకు వెళ్లాల్సి వస్తోంది. కనీసం ఇప్పుడున్న తరగతి గదులకు అదనంగా ఇంకో రెండు గదులు కేటాయించాలని కోరుతున్నారు.



ఆనందపురం జెడ్పీహైస్కూల్ ఆవరణలో ప్రభుత్వ జూనియర్ కళాశాల


జూనియర్ కళాశాల నిర్వహించే హాల్


ఇంటర్ సెకండియర్ తరగతుల నిర్వహణ

అందుబాటులో కళాశాల


నేను ఇదే జెడ్పీ హైస్కూల్‌లో చదువుకుని, టెన్త్ పాసయ్యా. స్కూల్ ఆవరణలో ఆనందపురం మండల ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు బాగుంది. కానీ వసతులు కనీస స్థాయిలోనూ లేవు. లేదంటే చాలా మంది విద్యార్థులు చేరేవారు. ట్రిపుల్ ఐటీ ప్రవేశాలు చూసుకుని మరింత మంది చేరుతారు. – **ఆకుల తులసి, ఫస్టియర్**

హాస్టల్ వసతి ఉంది


మాది ఎస్.కోట. ప్రస్తుతం నేను ఈ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. మా తమ్ముడు నేను కూడా హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నాం. టీచింగ్‌లో మా కాలేజీ కార్పొరేట్ కళాశాలలకు ఏమాత్రం తీసిపోదు. అయితే వసతుల సమస్య వేధిస్తోంది. ఆ దిశగా ప్రభుత్వం దృష్టి సారిస్తే ఇక్కడి విద్యార్థులు ఇబ్బంది లేనట్లే..! – **పి.తేజ, ఫైనల్ ఇయర్**

తల్లికి వందనం రాలేదు


పేద విద్యార్థులే ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో చదువుకుంటారు. ఫస్టియర్‌లో 384 మార్కులు వచ్చాయి. గత ప్రభుత్వం ఉన్నప్పుడు ఠంచనుగా అమ్మఒడి అందేది. గత సంవత్సరం తల్లికి వందనం ఇవ్వలేదు. ఈ సంవత్సరం టెక్నికల్ సమస్య కారణంగా నాకు డబ్బులు రాలేదు. అధ్యాపకుల దృష్టికి తీసుకువెళ్లాను.
–**లంకలపల్లి మోహన కృష్ణవేణి, ఫైనల్ ఇంటర్**

అడ్మిషన్లు పెంచేందుకు కృషి


ఉచితంగా పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, తల్లికి వందనం వంటి వసతులు ఉన్న ప్రభుత్వ జూనియర్ కాలేజీలు పేద విద్యార్థులకు ఓ వరం. మాకు ఇప్పుడు ఉన్న వసతి కింద ఉన్న మరో రెండు గదులు కేటాయిస్తే బాగుంటుంది. ఇంకా 10 రోజుల వ్యవధి ఉన్నందున తల్లిదండ్రుల సహకారంతో అడ్మిషన్లు పెంచేందుకు కృషి చేస్తున్నాం.
– **సుధాకర్, గణితం అధ్యాపకుడు**

మంచి ఫలితాలు వస్తాయి


ప్రభుత్వ కళాశాల అని చిన్న చూపు తగదు. ముఖ్యంగా ప్రభుత్వ హైస్కూళ్ల విద్యార్థులు నమ్మకంతో వచ్చి చేరితే ఖచ్చితంగా మంచి ఫలితాలు సాధిస్తాం. గత ఏడాది జిల్లాలోనే ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఫలితాలలో మేం రెండో స్థానంలో నిలిచాం. తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు సహకరిస్తే మరింత మంచి ఫలితాలు తెప్పిస్తాం.
–**వెంకటరావు, ఫిజిక్స్ అధ్యాపకుడు**


జూనియర్ కళాశాలలో పాత పుస్తకాలు

క్లుప్తంగా

ఘనంగా ఎస్‌ఓఎస్ చిల్డ్రన్స్ విలేజ్ డే


భీమిలి ఎస్‌ఓఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌లో పిల్లలకు బహుమతులు అందిస్తున్న ఎంపీ భరత్

కొమ్మాది: భీమిలిలోని ఎస్‌ఓఎస్ చిల్డ్రన్స్ విలేజ్ డే కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి విశాఖ ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలను దత్తత తీసుకుని వారికి చక్కని భవిష్యత్తును అందిస్తున్న ఎస్‌ఓఎస్ సేవలు ఎంతో గొప్పవని కొనియాడారు. ప్రపంచ వ్యాప్తంగా ఇటువంటి విలేజ్‌లను స్థాపించిన డాక్టర్ హెర్మన్ గ్మీనర్ అభినందనీయులన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా పిల్లలు బాగా చదువుకుని అన్ని రంగాల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. ఎస్‌ఓఎస్ చిల్డ్రన్స్ విలేజ్ ఇన్‌చార్జి మణికందన్ మాట్లాడుతూ ఇక్కడి అవసరాలకు సోలార్ విద్యుత్ సదుపాయం కల్పించాలని, అవకాశం మేరకు ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా టెన్త్, ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎస్‌వోఎస్ ప్రతినిధులు కె.దుర్గరాజు, వై.జాన్ పాల్గొన్నారు.

అర్చకుడి అదృశ్యంపై పోలీసుల స్టేట్‌మెంట్

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: భీమిలి పట్టణంలోని భ్రమరాంబికా సహిత చోడేశ్వరస్వామి ఆలయ అర్చకుడు ఏడిద గణేష్ సుబ్రహ్మణ్య శాస్త్రి అదృశ్యంపై ఎట్టకేలకు భీమిలి పోలీసులు స్టేట్‌మెంట్ నమోదు చేశారు. 'భీమిలి అర్చకుడు తిరుపతిలో అదృశ్యం' శీర్షికతో సోమవారం 'సాక్షి'లో వార్త ప్రచురించిన సంగతి తెలిసిందే. దీనిపై భీమిలి పోలీసులు అర్చకుని ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడి స్టేట్‌మెంట్లు నమోదు చేశారు. ఏప్రిల్ 24న తిరుపతి వెళ్లిన అర్చకుడు 26న అదృశ్యమైనట్టు తెలిసిందే. అప్పట్లో కుటుంబ సభ్యులు తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసిన మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయగా.. ఈ నెల 13న మరోమారు భీమిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు మేరకు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయినప్పటికీ అర్చకుని అదృశ్యంపై ఈ రెండు పోలీస్ స్టేషన్ల నుంచి ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి కనిపించలేదు. అర్చకుడు కనిపించడం లేదని పట్టణంలో రెండు నెలలుగా చర్చ జరుగుతున్నా.. స్పందించని పోలీసులు స్టేట్‌మెంట్ నమోదుకు వెళ్లినప్పుడు మాత్రం దమ్ముంటే తిరుపతిలో ఈ వార్త రాయవచ్చు కదా భీమిలిలో ఎందుకు అని గొణుక్కున్నట్టు తెలిసింది. పట్టణ ప్రముఖులు, భక్తులు మాత్రం అర్చకుని అదృశ్యం మిస్టరీ వీడి ఆయన క్షేమంగా ఇంటికి చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరోవార్డు పరిధి బక్కన్నపాలెం 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌కు చెందిన 11 కేవీ హెచ్‌పీసీఎల్ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. దీంతో సాండ్ అండ్ సాండ్ లేఅవుట్, సృజనా లేఅవుట్, సుగర్‌కేన్ లేఅవుట్, హెచ్‌పీసీఎల్ లేఅవుట్, హౌసింగ్ బోర్డు కాలనీ, లలితాంబ గుడి ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

స్టూడెంట్ స్పెషల్ బస్సును పునరుద్ధరించండి



తగరపువలస: తగరపువలస–భీమిలి పట్టణాల మధ్య స్టూడెంట్ స్పెషల్ బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని ఈ ప్రాంత విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. ఏటా విద్యాసంస్థలు ప్రారంభమయ్యాక ఉదయం, సాయంత్రం వేళల్లో తగరపువలస–భీమిలి మధ్య మూడేసి ట్రిప్పులు స్టూడెంట్ స్పెషల్ సర్వీసులు నడుస్తుంటాయి. ఈ విద్యా సంవత్సరం మొదలై రెండు వారాలు గడుస్తున్నాయి. బస్ పాస్‌లు కూడా జారీ చేశారు. అయినా ఇంకా ఈ బస్సు సర్వీసులను ప్రారంభించలేదు. దీంతో పాస్‌లు తీసుకున్న విద్యార్థులు కూడా ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఎప్పటిలానే ఈ రెండు పట్టణాల మధ్య బస్ సర్వీస్‌ను పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ సీట్లు


వెంకట కీర్తన్ | సరగడ జగదీష్ | చెల్లూరి వినయ్ | రఘువర్మ | మేఘన సంధ్య | అనూష


రవ్వ జోహిత | పి.నందిని | ఎస్.గాయత్రి | మేఘన | సంజన

తగరపువలస: స్థానిక ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు సోమవారం ప్రకటించిన ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో సీట్లు సాధించారు. చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులకు సీట్లు లభించాయి. జీరు వెంకట కీర్తన్‌కు నూజివీడు క్యాంపస్‌లో, సరగడ జగదీష్, చెల్లూరి వినయ్, కందివలస రఘువర్మలకు శ్రీకాకుళం క్యాంపస్‌లో సీట్లు పొందారు. ఈ సందర్భంగా వీరిని ప్రధానోపాధ్యాయుడు ఆదినారాయణ అభినందించారు.

- భీమిలి గొల్లలపాలెంలోని కేజీబీవీలో 10వ తరగతిలో 570 మార్కులు సాధించిన కొక్కిరి మేఘన సంధ్యకు శ్రీకాకుళం క్యాంపస్‌లో సీటు లభించింది. ఈమె తండ్రి మురళి ఆటోడ్రైవర్.
- భీమిలి మండలం తాళ్లవలస జెడ్పీ హైస్కూల్‌కు చెందిన రవ్వ జోహితకు నూజివీడు క్యాంపస్‌లోను, రాయిన అనూషకు శ్రీకాకుళం క్యాంపస్‌లో సీట్లు లభించాయి. వీరిని ప్రధానోపాధ్యాయుడు కె.ప్రభాకర్, పాఠశాల కమిటీ చైర్మన్ చుక్క లక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

పద్మనాభం మండలంలో ఐదుగురి ఎంపిక

పద్మనాభం: మండలంలోని ఐదుగురు విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో సీట్లు లభించాయి. రేవిడి వెంకటాపురం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన పి.నందిని, ఎస్.గాయత్రి, బీఆర్ తాళ్లవలస జెడ్పీ హైస్కూల్‌కు చెందిన బంగారు మేఘన, కొండపల్లి సంజన, పిన్నింటి వర్షిత్ కుమార్ సీట్లు సాధించారు. ఈ ముగ్గురికి శ్రీకాకుళం క్యాంపస్‌లో సీట్లు లభించాయి. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, పాఠశాల పేరెంట్స్ కమిటీల సభ్యులు అభినంధించారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి


పెద్దిపాలెంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నేత నాగమణి


తగరపువలస: భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా సోమవారం ఆనందపురం మండలం పెద్దిపాలెంలో బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. జాతీయ సమైక్యతకు, జాతీయవాదానికి శ్యామ్‌ప్రసాద్ మారుపేరు అన్నారు. కార్యక్రమంలో ఉప్పాడ అప్పారావు, పీవీవీ ప్రసాదరావు, మీసాల రామునాయుడు, పోతిన జీవన సంతోష్, బోర శ్రీను, మల్లవరపు కృష్ణ, మోహన్, నిమ్మకాయల అప్పలరాజు, ఉప్పాడ శివ, పిల్లా చిన్నారావు, బాలి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్యామ్‌ప్రసాద్ బలిదాన దినోత్సవం

పద్మనాభం: స్థానిక బీజేపీ కార్యాలయంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదాన దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖర్జీ చిత్రపటానికి బీజేపీ మండల శాఖ అధ్యక్షురాలు తమటపు నాగమణి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 51 ఏళ్ల వయసులో దేశం కోసం ప్రాణాలర్పించిన దేశభక్తుడిగా శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ త్యాగం చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు సిరిపురపు వెంకటరావు, పాలూరి కృష్ణారావు, ఆర్.శ్రీనివాసరావు, కె.పేర్రాజు, సన్యాసిరావు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త.. పరిసరాల్లో దుర్గంధం


రాజీవ్‌నగర్‌లో పేరుకుపోయిన చెత్త


రామాలయం వద్ద పారిశుధ్య దుస్థితి

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో ఏ ప్రాంతం చూసినా దుర్వాసనే, ఏ రోడ్డు పక్కన చూసినా వ్యర్థాలే. ఇక్కడ శానిటేషన్ సిబ్బందిలో చిత్తశుద్ధి కొరవడటమే వార్డులో పారిశుధ్య నిర్వహణ దారుణంగా ఉండటానికి కారణం. ఎండాడ, రాజీవ్‌నగర్, రామాలయం వీధి, దుర్గానగర్, ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ, వరాహగిరినగర్ ప్రాంతాల్లో చెత్తాచెదారంతో స్థానికులు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. సచివాలయంలో, జోనల్ కార్యాలయంలో పారిశుధ్య నిర్వహణపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో దుర్వాసనతో పాటు ఈగలు, దోమలతో సహవాసం చేయాల్సిన పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకుంటే ఈ ప్రాంత వాసులంతా రోగాల బారిన పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. వార్డులో పారిశుధ్య నిర్వహణపై స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, గతంలో జీవీఎంసీ కమిషనర్ ఎన్నిసార్లు అసహనం వ్యక్తం చేసినా అధికారుల్లో మాత్రం మార్పు రావడం లేదు.

అర్జీల పరిష్కారానికి తక్షణ చర్యలు


జెడ్పీ అయ్యప్పనాయుడికి వినతిపత్రం అందిస్తున్న వినియోగదారుల సేవా సంఘం సభ్యులు


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జోన్-2 కమిషనర్ కనకమహాలక్ష్మి

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్–2 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 11 అర్జీలు వచ్చాయి. జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పట్టణ ప్రణాళిక విభాగం–2, ఇంజినీరింగ్ వర్క్స్–04, వాటర్ సప్లై–01, రెవెన్యూ–01, విద్యుత్ శాఖ–01, పబ్లిక్ హెల్త్–02 చొప్పున 11 అర్జీలు అందాయి. సాయిప్రియ గార్డెన్ ఫేజ్–2 ఫ్లాట్ నంబర్–38 వద్ద రోడ్లు నిర్మాణం, మరమ్మతుల గురించి ఫణికుమార్, 6వ వార్డు ఆర్‌హెచ్ కాలనీ ఎల్ఐజీ–29 వద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఇదే కాలనీలో డ్రైనేజీ మరమ్మతులపై చంద్రశేఖర్, 8వ వార్డు బాలాజీ బే మౌంట్ రుషికొండ వద్ద స్క్రాప్ దుకాణం, క్యాంటీన్ తొలగింపు కోసం సత్యనారాయణ, కో ఆపరేటివ్ కాలనీ విశాలాక్షినగర్ వద్ద ప్రభుత్వ స్థలం ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని కె.వెంకట బహానీ కోరారు. ఇలా జోనల్ పరిధిలోని 13 వార్డులకు చెందిన వివిధ ప్రాంతాల నుంచి పలు సమస్యలపై అర్జీలు అందాయి. వీటిపై తక్షణ చర్యలు చేపడతామని జెడ్సీ కనకమహాలక్ష్మి హామీ ఇచ్చారు.

పీజీఆర్ఎస్‌కు ఏడు వినతులు

కొమ్మాది: భీమిలి జోనల్ కార్యాలయం వద్ద సోమవారం జెడ్పీ ఒమ్మి అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో జరిగిన పీజీఆర్ఎస్‌కు ఏడు వినతులు వచ్చాయి. రెవెన్యూ విభాగానికి 4, యూసీడీకి 2, ప్రజారోగ్య విభాగానికి ఒకటి చొప్పున జెడ్సీ అర్జీలు స్వీకరించారు. ఇక్కడి వినియోదారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అధ్యక్ష, కార్యదర్శులు కె.ఎస్.నాయుడు, పి.రాజేంద్రప్రసాద్ వర్మ పలు సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందించారు. జమ్మి చెరువు, బీచ్ పార్కును సంరక్షించాలని, వాచ్‌మెన్‌లను నియమించాలని కోరారు. తహసీల్దార్ రామారావును కలిసి రేషన్ డిపోల్లో వేలిముద్రలు పడకపోయినా రేషన్ ఇవ్వాలని కోరారు. సభ్యులు పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, ఎం.సూర్య శ్రీనివాసర్, టి.భీమారావు, ఆదినారాయణ పాల్గొన్నారు.

తుప్పల తొలగింపు


పాత మధురవాడ మెట్ట మరుగుదొడ్ల వద్ద తుప్పలు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

మధురవాడ: తుప్పలు, డొంకలతో నిరుపయోగంగా పడివున్న జీవీఎంసీ స్వచ్ఛ భారత్ మరుగుదొడ్ల వద్ద ఎట్టకేలకు జీవీఎంసీ సిబ్బంది పరిశుభ్రత పనులు చేపట్టారు. జీవీఎంసీ 8వ వార్డు వాంబేకాలనీ పాత మధురవాడ మెట్ట రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన మరుగుదొడ్లు నిర్వహణ లేక ఏడాదిగా మూలకు చేరాయి. లక్షలు వెచ్చించినా లక్ష్యానికి దూరంగా ఉన్న వీటి దుస్థితిపై సోమవారం సాక్షి దినపత్రికలో 'మూలకు చేరిన మరుగుదొడ్లు' శీర్షికన వార్త ప్రచురితమయింది. దీనికి జీవీఎంసీ ప్రజారోగ్యం అధికారులు స్పందించారు. సూపర్‌వైజర్ శ్రీనివాసరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌ల ఆధ్వర్యంలో సిబ్బంది తుప్పలు తొలగించారు. అయితే దీన్ని ప్రజల వినియోగంలోకి ఎప్పుడు తీసుకొస్తారన్నదానిపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు.

ఇసకలపాలెంలో 5 తరగతులూ కొనసాగించాలి

పద్మనాభం: మండలంలోని పద్మనాభం పంచాయతీ ఇసకలపాలెం ప్రాథమిక పాఠశాలలో 5 తరగతులూ కొనసాగించాలని విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో పాఠశాల ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ హంస జ్యోతి వినతి పత్రం అందించారు. 50 ఏళ్లుగా తమ స్కూల్లో 1 నుంచి 5 తరగతులు నడుస్తున్నాయన్నారు. ఇప్పుడు 3 నుంచి 4 తరగతులను పద్మనాభంలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో విలీనం చేయడం సరికాదన్నారు. చిన్నారులు పద్మనాభం వెళ్లాలంటే ప్రధాన రహదారిని దాటాల్సి ఉన్నందున ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. తక్షణమే 3, 4, 5 తరగతుల తరలింపును నిలిపివేయాలని ఆ వినతిపత్రంలో కోరారు.

బ్లూ ఫ్లాగ్ బీచ్.. మళ్లీ మొదటికి!


రుషికొండ బీచ్‌లో గుంపులుగా సంచరిస్తున్న గేదెలు


ఎక్కడ పడితే అక్కడే సంచరిస్తున్న కుక్కలు

కొమ్మాది: ప్రపంచ స్థాయి(బ్లూఫ్లాగ్) గుర్తింపు పొందిన రుషికొండ బీచ్ కథ మళ్లీ మొదటికే వస్తోంది. ఇక్కడ అధికారులు నిర్వహణ గాలికి వదిలేయడంతో బ్లూఫ్లాగ్ గుర్తింపును గతంలో తాత్కాలికంగా రద్దు చేశారు. మళ్లీ నానా తిప్పలు పడి ఆ గుర్తింపును పునరుద్ధరించుకున్నారు. నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా కఠినంగా చర్యలు తీసుకుంటామని స్వయంగా కలెక్టర్ హెచ్చరించినా ఇక్కడ పరిస్థితిలో మార్పులేదు. ప్రస్తుతం రుషికొండ బీచ్‌లో ఎక్కడికక్కడ కనిపిస్తున్న నిర్వహణ లోపమే దీనికి ప్రత్యక్ష నిదర్శనం. దీంతో పర్యాటకులు ఇక్కడకు రావాలంటే బెంబేలెత్తిపోతున్నారు. ఎక్కడ చూసినా కుక్కలు, గేదెలు విచ్చలవిడిగా సంచరిస్తూ పర్యాటకులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఏ క్షణాన ఎటువైపు నుంచి ఇవి దాడి చేస్తాయోనని పర్యాటకులు ఆందోళన చెందుతున్నారు. పిల్లలతో వచ్చిన వారు మరీ ఇబ్బందిగా గడపాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన బీచ్‌లో నిర్వహణపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని లేకుంటే బ్లూఫ్లాగ్ గుర్తింపు చేజారిపోయే ప్రమాదం ఉందని పలువురు పర్యాటకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఖాళీ వాటర్ బాటిల్‌లో పాము


పామును బయటకు తీస్తున్న అటవీ శాఖ సిబ్బంది

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్‌కు ఎదురుగా ఉన్న బీచ్ సమీపంలో అటవీశాఖ భూమి వద్ద ఖాళీ వాటర్ బాటిల్‌లో చిక్కుకున్న పామును అటవీశాఖ అధికారులు సోమవారం కాపాడారు. బాటిల్‌లో దూరిన పాము బయటకు వచ్చేందుకు ప్రయత్నించడాన్ని గమనించిన కొందరు, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన అధికారులు అక్కడకు చేరుకుని పామును సురక్షితంగా బయటకు తీశారు. జనావాసాలు లేని ప్రదేశంలో విడిచిపెట్టారు.

విద్యుత్ షాక్‌తో పాడిగేదె మృతి


మృతి చెందిన పాడిగేదె

పద్మనాభం: మండలంలోని గంధవరంలో సోమవారం విద్యుత్ షాక్‌కు గురై ఓ పాడిగేదె మృతి చెందింది. వివరాలిలా.. ఉగ్గిన సోంబాబుకు చెందిన రూ.86,000 విలువ చేసే గేదె ఇతర పశువులతో పొలంలో మేతకు వెళ్లినప్పుడు స్తంభానికి ఉన్న సపోర్టు వైరును తాకింది. దానిపైన కండక్టర్‌కు చెందిన జంపర్ వంగిపోవడంతో విద్యుత్ సరఫరా అయ్యింది. దీంతో పాడిగేదె షాక్‌కు గురై మృతి చెందింది. ఇది ఉదయం, సాయంత్రం కలిపి 8 లీటర్లు పాలు ఇస్తుందని యజమాని తెలిపాడు.